అవాక్కై వింటున్నారంతా.

రామారావు, శారదమ్మ, రాఘవ- సరిత వైపు చూశారు ఆమెకి ఈ షరతు ఆమోదయోగ్యమైనదా, కాదా అని. వాళ్లకైతే ఎటువంటి అభ్యంతరం లేదు.

ఒక్కక్షణం సరిత ఆలోచనలో పడింది. 'ఈ షరతుకి ఒప్పుకోవాలా లేక, ఈసారి పెళ్లి చూపులకి వచ్చేవాళ్లకి తను విధించబోయే షరతుల్లో కొత్తగా- కట్నం తీసుకోక పోయినా తీసుకున్నట్లు చెప్పడం చేయకూడదని చేర్చాలా' అని ఆలోచిస్తోంది ఆమె.

ఆమె ఆలోచనల్లోంచి బయటపడకుండానే లేచారు మగపెళ్లివారు "ఏ విషయం తెలియపర్చండి" అని.

ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థంకాక ఆలోచనలో పడింది సరిత.

**-డి.వి.డి.ప్రసాద్ (పదంపూర్)**

# మూల్యం

**"అమ్మా! నేను బైక్ కొనుక్కుంటాను. రోజూ యూనివర్శిటీకి బస్ మీద వెళ్లి రావాలంటే ఇబ్బందిగా వుంది. టైమ్ అంతా బస్ కోసం ఎదురు చూడడంతోనే అయిపోతోంది. నా ఫ్రెండ్స్ అంతా ఎప్పుడో పెద్ద బళ్ళు కొనేసుకున్నారు"**

సునీల్ మాటలకి పార్వతికి ఒళ్ళు మండిపోయింది.

"నీకేమైనా మతిపోయిందట్రా! ఈ సంవత్సరమే కదా ఇంజనీరింగ్‌లో చేరావు. అప్పుడే నీకు బైకులు, షోకులు కావాల్సివచ్చాయా? బస్‌లో వెళ్ళి చదవడానికే నీకు అంత కష్టంగా వుంటే, నీ ముందు సముద్రం అంత చదువుంది. అదెలా చదువుతావురా? మీ ఫ్రెండ్స్ తల్లిదండ్రులిద్దరూ వుద్యోగాలు చేస్తున్నారు. వేలకి వేలు సంపాదించుకుంటున్నారు. మన పరిస్థితి ఏమిటో కాస్త ఆలోచించావా? తండ్రి లేని పిల్లాడివి. తల్లి వుద్యోగం చేసి సంపాదిస్తుంటే, కష్టపడి చదువుకోవడం మానేసి జల్సాలు చేస్తావా? అస్సలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నావు?" ఆవేశంతో పార్వతి కంఠంలో చిన్న వణుకు.


సునీల్ చేతిలో వున్న పుస్తకాన్ని పక్కన పెట్టి "నేనేమీ జల్సాల కోసం బండి కొనమన్లేదు. రోజూ రెండు బస్‌లు మారి కాలేజీకి వెళ్ళడం, మళ్ళీ రెండు బస్‌లు మారి యింటికి రావడం. ఉన్న టైమ్ అంతా బస్సులకే అయిపోతే యింక చదువుకోవటం ఎలా? అయినా ఈ వయస్సులో కాకపోతే ముసలివాణ్ణి అయ్యాక బైక్ కొనుక్కోవాలా? బ్యాంక్‌లో నాన్నగారికి వచ్చిన డబ్బుంది కదా! అది వాడితే తప్పేంటి?" రోషంగా అన్నాడు సునీల్.

నిన్నటివరకు ఎంతో మర్యాదగా మాట్లాడిన కొడుకు, బైక్ కొనొద్దన్నందుకే యిలా ఎదురుతిరిగి మాట్లాడేసరికి ఆ తల్లి మనస్సు తట్టుకోలేకపోయింది. కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"నాన్నగారు చనిపోయిన తర్వాత వచ్చిన డబ్బురా అది. తన కొడుకుని పెద్ద వుద్యోగస్థుడిగా చూసుకోవాలని ఆయన ఎన్నో కలలు కన్నారు. అవేమీ తీరకుండానే అర్థాంతరంగా వెళ్ళిపోయిన ఆయన కోరిక తీరాలంటే ఆ డబ్బులో ప్రతీ పైసా నీ చదువుకే వుపయోగించాలని అనుకున్నాను. ఇంట్లో ఎంత అవసరమైనా పనిమనిషిని పెట్టుకోలేదు. గ్రైండర్, ఫ్రిజ్ అంటూ ఏ వస్తువూ కొనుక్కోలేదు. నేను బయటకు వెళ్ళి వుద్యోగం చేస్తున్నా ఏనాడూ ఖరీదైన చీరలు కొనుక్కోలేదు. నీ చదువుకి ఆటంకం అవుతుందని టీవీ కూడా చూడడం మానేసాను. నువ్వు యివన్నీ ఎప్పుడైనా ఆలోచించావా? అయిదారేళ్ళు కష్టపడి చదివితే మంచి వుద్యోగం వస్తుంది. అప్పుడు ఏకంగా కారే కొనుక్కోవచ్చు. ఇప్పుడు మాత్రం నన్నేమీ కొనమనొద్దు."

కళ్లు తుడుచుకుని గబగబా పార్వతి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

★ ★ ★



"సినిమాకి వెళ్దామంటే రానంటావు. బీచ్ అంటే వద్దంటావు. పోనీ అలా క్యాంటీన్ వరకు అయినా రారా బాబూ అంటే, ఏమీ మాట్లాడకుండా అలా దిమ్మచెక్కలా కూర్చున్నావేంట్రా, అసలు నీకేమైంది ఈరోజు?" కోపంగా అరిచాడు రమేష్.

"మన సునీల్‌గాడు కొంపదీసి ప్రేమలో పడలేదు కదా! మొన్న మనం చూసిన సినిమాలో హీరో కూడా ప్రేమలో పడినప్పుడు 'మాడిన వంకాయ' మొహం వేసుకుని తిరుగుతూంటాడు. మన వాడి ఫేస్ కూడా అచ్చంగా అలాగే వుంది"

కిరణ్ మాటలకి మిత్ర బృందం అంతా నవ్వుల వర్షం కురిపించారు. సునీల్ రోషంగా "ప్రేమా లేదూ, దోమా లేదు. ఈ పండుగకి మనందరం బైక్‌లు కొనుక్కుందామని అనుకున్నాము కదా! మీ అందరి యిళ్ళల్లో గ్రీన్ సిగ్నల్స్ యిచ్చేసారు. కానీ మా ఇంట్లోనే అమ్మ వద్దంది. ఇప్పుడేం చెయ్యాలో తెలియక నేను బాధపడుతుంటే, మధ్యలో మీ బోడి హాస్యం ఒకటి"

సునీల్ మాటలు విని రమేష్, కిరణ్ ఆలోచనలో పడ్డారు. అయిదు నిమిషాలు గడిచాయి.

"యురేకా! ఒరేయ్ సునీల్, బ్రహ్మాండమైన ఐడియా వచ్చిందిరా! నువ్వు కరెక్ట్‌గా చెయ్యగలిగితే మీ అమ్మగారు నిమిషాల మీద బైక్‌కొని, తాళం చెవులు నీ చేతిలో పెడతారు" అంటూ కిరణ్ తనకొచ్చిన ఐడియాని సునీల్ చెవిలో వూదాడు.

ఒక్కసారి వులిక్కిపడ్డాడు సునీల్. "కిరణ్! రిస్కేమోరా" అన్నాడు భయంగా. చిన్నగా కాళ్లు వణుకుతున్నాయి.

"పిరికివాడిలా మాట్లాడకు. సాహసం చేసినప్పుడే విజయలక్ష్మి వరిస్తుంది. రెండుగంటలు నీ శరీరాన్ని కష్టపెడితే కొత్త బైక్ నీ చేతుల్లో వుంటుంది. టట్టడాం."

కిరణ్ మాటలతో ఆలోచనలో పడ్డాడు సునీల్.

★ ★ ★

హాస్పిటల్ బెడ్ మీద సునీల్ మగతగా పడి వున్నాడు.

"ప్లీజ్ డాక్టర్..ప్లీజ్..వాణ్ణి రక్షించండి. వాడు తప్ప నాకెవరూ లేరు. ఎలాగైనా రక్షించండి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు" పిచ్చిదానిలా వున్న పార్వతి తన కొడుకుని చూసుకుంటూ, గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది.

"అయామ్ సారీ అమ్మా! మీ అబ్బాయి తాగింది పవర్‌ఫుల్ పురుగుల మందు. అందుకే తీసుకున్న విషం కొంచెం అయినా ప్రాణం మీదికి వచ్చింది. మా ప్రయత్నం మేము చేస్తాం. తర్వాత మీ అదృష్టం?"

డాక్టర్ మాటలు వింటూనే సునీల్ చేతిని పట్టుకుని "ఒరేయ్ కన్నా! ఎంతపని చేసేవురా! ఈ ప్రపంచంలో నాకు నువ్వు తప్ప ఎవరున్నార్రా? మీ అమ్మకి యింత అన్యాయం చేస్తావా? నా తండ్రివి కదా లేమ్మా! లేరా బాబూ..చూడరా నీ ఫ్రెండ్స్ అంతా వచ్చారు. బైక్ కావాలన్నావు కదూ, తప్పకుండా కొంటాన్రా.. కళ్లు తెరు.. బాబూ సునీల్..కన్నా" ఏడుస్తున్న పార్వతిని వోదార్చటం ఎవరి తరమూ కావడం లేదు.ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మీ అమ్మగారిని బెదిరిస్తే ఆవిడ భయపడి బైక్ కొంటుందని తనిచ్చిన సలహా స్నేహితుడి ప్రాణం మీదికి రావడం చూసి కిరణ్ తలబాదుకుని ఏడుస్తున్నాడు.

సునీల్ మగతలో కలవరిస్తున్నాడు "అమ్మా! యింకెప్పుడూ యిలా చెయ్యనమ్మా! నాకు బైక్ వద్దు. నా జీవితం కావాలి.. అబ్బా.. నేను చచ్చిపోనమ్మా.. బ్రతకాలని వుం..."

మాట ఆగిపోయింది. సునీల్ ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆత్మహత్య అనే ఆయుధాన్ని వుపయోగించి బెదిరించాలని అనుకున్న సునీల్‌కి తన జీవితాన్నే 'మూల్యం'గా చెల్లించాల్సి వచ్చింది.

**-డి.స్వర్ణశైలజ (ఖరగ్‌పూర్)**